క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



మహాముత్తారం: గ్రామంలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డీపీఓ ఆశాలత పంచాయతీ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని బోర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేదన్నారు. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామంలో అంటువ్యాధులు రాకుండా ఉండేందుకు సాయంత్రం సమయంలో ఫాగింగ్ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ కొనసాగించాలి



ములుగు రూరల్: ములుగు–అంకన్నగూడెం బస్సు సర్వీస్‌ను గతంలో మాదిరిగా కొనసాగించాలని సీపీఎం ఏజెన్సీ ఏరియా నాయకుడు గుండబోయిన రవిగౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాయినిగూడెం బస్టాండ్ సెంటర్‌లో గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకన్నగూడెం బస్సు సర్వీస్‌ను ములుగు మండలం బరిగాలనిపల్లి, బండారుపల్లి మోడల్ పాఠశాలకు నడపడం వల్ల ఏజెన్సీ గ్రామల ప్రజలు సమయానికి బస్సు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీంతో రాయినిగూడెం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు సమయానికి చేరుకోవడం లేదని అన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పాత పద్ధతిలో బస్సు సర్వీస్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండమీది వెంకటేశ్వర్లు, దేవేందర్‌రావు, నవీన్, స్వామి, సమ్మయ్య, పాపయ్య, తిరుపతి, సాంబయ్య, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఎస్ఎస్ తాడ్వాయి: ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బండి అభిషేక్ ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వకారణమని జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరా నగర్‌కు చెందిన బండి అభిషేక్ ఎంబీబీఎస్ సీటు సాధించగా శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఇర్ప సునీల్ ఆధ్వర్యంలో జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బొల్లు దేవేందర్, నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొల్లు దేవేందర్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామం నుంచి ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి బండి అభిషేక్ ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పిట్టల సారయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల మల్లేష్, నాయకులు కల్లెబోయిన రాజయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ రంగరబోయిన జగదీష్, సంఘం రాము, డ్యాగల కిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

మంగపేట: మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు శిద్దంశెట్టి శ్రీనివాస్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే సీతక్క, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ఆందోళన

వెంకటాపురం(కె): రోడ్డు సరిగా లేకపోవడంతో దుమ్ము లేస్తుందని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాని వెంటనే మరమ్మత్తులు చేయాలని కోరుతూ మండల పరిధిలోని గొల్లగూడెం శుక్రవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గొల్లగూడెం గ్రామ సమీపంలో రోడ్డుపై లారీలు, వాహనాలు పెద్ద సంఖ్యలో తిరుగుతండటంతో దమ్ము లేస్తుందన్నారు. ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకోని మాట్లాడి ఆందోళన విరమింప చేశారు.

సంక్షేమ పథకాలతో సంతోషంగా ప్రజలు

టేకుమట్ల: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి, వెలిశాల, గర్మిళ్లపల్లి, రాఘవాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో కంటే ప్రత్యేక తెలంగాణలో పల్లెలన్ని అభివృద్ధి పథంలో ప్రయణించేందుకు ప్రత్యేకంగా నిధులు, పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం, 24గంటల విద్యుత్, రైతు బీమా, రుణమాఫీ ప్రకటించి వ్యవసాయాన్ని పండగలా చేస్తున్నారని అన్నారు. ప్రతిపక్షాల మాయ మాటలకు మోసపోవద్దని, అభివృద్ధిని గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవి, ఆకునూరి తిరుపతి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంగి రవి, వివిధ గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు నందికొండ శోభామహిపాల్‌రెడ్డి, అడగాని రామారావు, గందం సారయ్య, లచ్చిరెడ్డి, నల్లబెల్లి రమారవీందర్, తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్ల: మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి

చిట్యాల: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పని చేస్తామని ఆ పార్టీ మండల నాయకుడు నెరేళ్ల ఓదేలు అన్నారు. శుక్రవారం మండలంలోని నవాబుపేట గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. అనంతరం ఓదేలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. ప్రజలు అసెంబ్లీ ఎన్నికలలో గండ్ర వెంకటరమణారెడ్డిని అత్యధిక మెజారిటీతో ఓట్లువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కసిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సాద రాజు, గ్రామస్తులు బొమ్మ శంకర్, గోపగాని మహేష్, చింత నిప్పుల యశ్వంత్, మోత్కూరి సంతోష్, శివరాత్రి అనిల్, తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

భూపాలపల్లి రూరల్: తనకు ఓటు వేసి ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లోని కారల్ మార్క్స్ కాలనీ, కుందూరుపల్లి, బీసీ కాలనీ, మహబూబ్‌పల్లి, పుల్లూరి రామయ్యపల్లి గండ్రపల్లి, గాంధీనగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా అయన సత్యనారాయణరావు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన అరుగ్యారంటి పథకాలు తప్పక అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, 16 వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు దేవన్, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, యూత్ అధ్యక్షుడు పిప్పాల రాజేందర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, తదితర నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో సత్యనారాయణరావు

ప్రచార కమిటీ చైర్మన్‌గా రమేశ్‌రెడ్డి



ప్రకటిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కాటారం: కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కమిటీ చైర్మన్‌గా కుంభం రమేశ్‌రెడ్డి నియమితులయ్యారు. మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, మండల కాంగ్రెస్ నాయకులకు రమేశ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కొమురంభీం ఆశయాలను కొనసాగించాలి

చిట్యాల: ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు కొమురం భీం ఆశయాలను నేటి యువత కొనసాగించాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కొమురం భీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల, గిరిజనుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసి వారిని చైతన్యపరిచిన గొప్ప మహనీయుడు కొమురంభీం అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గుర్రపు రాజేందర్, కుమార్, రాజమౌళి, కిరణ్, సదానందం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేస్తున్న మల్లయ్య

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న రాజిరెడ్డి

మహాముత్తారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు మండలంలోని కనుకునూర్, నేతకానిపల్లి, ములుగుపల్లి, పెగడపల్లి తదితర గ్రామాల్లో పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మహాముత్తారం ఎంపీటీసీ శ్రీపతి సురేష్, సింగిల్‌విండో చైర్మన్ సోమశాంత కుమార్, బోర్లగూడెం ఎంపీటీసీ వసంతరూపానాయక్ తదితరులు ఉన్నారు.

మాలమహానాడు ఆవిర్భావ వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

రేగొండ: మండల కేంద్రంలో మాలమహానాడు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ.. జాతీయ మాలమహానాడు బలోపేతానికి అన్ని కమిటీలను నియమించామన్నారు. మాలలందరు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లిగోరి అధ్యక్షుడు పసుల రాకేష్, జిల్లా నాయకులు రజినికాంత్, తిరుపతి, అశోక్, నర్సయ్య, సూర్యం, నవీన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

‘చర్య తీసుకోవాలి’

కాటారం: మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కేంబ్రిడ్జి పాఠశాలపై చర్య తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బోనాల సునీల్‌చారి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని విద్యాశాఖ అధికారి కార్యలయంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. విద్యా ప్రమాణాలు పాటించకుండా నిబంధనలకు తుంగలో తొక్కుతూ పాఠశాల నిర్వాహణ చేపడుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు బోద్యం చూస్తున్నారని ఆరోపించారు. జీఓ నంబర్ 1, 41, 91లను బేఖాతరు చేస్తూ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. తల్లిదండ్రులను మభ్య పెడుతూ వేలాది రూపాయల ఫీజులను దండుకుంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కాటారం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాటారం, మహదేవపూర్ సీఐలు రంజిత్‌రావు, కిరణ్ అన్నారు. కాటారం సబ్ డివిజన్ పరిధిలోని సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు మండల కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన కూడలి వరకు కవాతు చేశారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిత్యం పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ఎస్సైలు అభినవ్, నరేశ్, థామస్‌రెడ్డి పాల్గొన్నారు.

‘పార్టీ మారే ప్రసక్తే లేదు’

రేగొండ: తాము పార్టీ మారబోతున్నట్లు వస్తున్న వార్తలను రేగొండ ఎంపీపీ పున్నం లక్ష్మీరవి శుక్రవారం ఒక ప్రకనటలో తీవ్రంగా ఖండించారు. కొన్ని రోజులుగా తాము బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాము జీవితాంతం బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతామని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గండ్ర వెంకట రమణా రెడ్డి గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

బీఆర్ఎస్‌కు సర్పంచ్‌ల రాజీనామా

చిట్యాల: మండలంలోని జడల్‌పేట సర్పంచ్ కామిడి రత్నాకర్‌రెడ్డి, నవాబుపేట సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ఒక ప్రకనటలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో తగిన గుర్తింపు లేకపోవడంతో మూలంగా మనస్థాపానికి గురై రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. తమ రాజీనామా పత్రాలను మండల పార్టీ అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్యకు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతిలకు సమర్పించినట్లు తెలిపారు. తమ రాజకీయ భవిష్యత్‌ను రెండు రోజులలో తెలుపుతామని వెల్లడించారు. కాగా మండలంలో ఇద్దరు సర్పంచ్‌లు రాజీనామా చేయడం మండలంలో చర్చంశనీయంగా మారింది. అలాగే ఈదే బాటలో మరికొంత మంది సర్పంచ్‌లతో పాటు నాయకులు వెళ్తున్నట్లు సమాచారం.

రామాలయంలో ఉచిత వైద్యశిబిరం

ఏటూరునాగారం: అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 250 మందికి పైగా బీపీ, షుగర్, ఇతర పరీక్షలు నిర్వహించారు. 30వేలు విలువ చేసే మందులను ఉచితంగా రోగులకు అందజేశారు. వైద్య శిబిరంలో డాక్టర్లు ప్రజలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నరేందర్, అష్టలక్ష్మి, సిబ్బంది, రామాలయం చైర్మన్ మోడెం రమేష్, రామాలయ ఆలయ మాజీ చైర్మన్ పోగుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాల స్వాధీనం

చిట్యాల: మండల కేంద్రంలో నంబర్ ప్లేట్ లేని ఐదు ద్విచక్ర వాహనాలను ఎస్సై జంగిలి రమేష్ శుక్రవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనాదారుడు తప్పకుండా ద్విచక్రవాహనానికి నంబర్ ప్లేట్ కలిగి ఉండాలని అన్నారు. ఒక వేళ నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ప్రతి వాహనాదారుడు డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలని అన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది లింగన్న, అస్లాం జానీ, తదితరులు ఉన్నారు.



వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై రమేష్

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా..

టేకుమట్ల: నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపేడు, కుందనపల్లి, బండపల్లి, గుమ్మడవెల్లి, వెల్లంపల్లి, దుబ్యాల, మందలోరిపల్లి, రాఘవరెడ్డిపేట గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రం నిధులతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంతో పాటు, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే రాష్ట్రం అభివృద్ధిలో మరింత ముందుకు సాగుతుందని అన్నారు. ఎన్నికల వేళ మాయ మాటలు చెప్పే నాయకులకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు ఉన్నారు.



ఎన్నికల ప్రచారంలో చందుపట్ల కీర్తిరెడ్డి

బీజేపీ వస్తే ఉచిత విద్య, వైద్యం

రేగొండ: తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తే ఉచితంగా విద్య, వైద్యం అందిస్తామని ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాధవ్, భూపాలపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కీర్తిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు బూత్ స్థాయిలో ప్రతి ఓటరుని కలిసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని అన్నారు. అనంతరం మండలంలోని కనిపర్తి, కొత్తపల్లి గ్రామాల నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకు బీజేపీలో చేరగా కీర్తిరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సత్యపాల్, పాపయ్య, రామచంద్రారెడ్డి, రఘునాథరెడ్డి జిల్లా నాయకులు నిశిధర్ రెడ్డి, ప్రసాద్‌రావు, అశోక్ రెడ్డి, మనోహర్, రాజు, రాకేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కాటారం: కాటారం మండలం చింతకానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సర్పంచ్ ఫిరోజ్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ కోసరి భాస్కర్, రాజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి మంథని ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి శ్రీధర్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కార్తీక్, సందీప్, దూలం శ్రీనివాస్, కుమార్, సమ్మయ్య, శంకర్ పలువురు ఉన్నారు. కిరణ్, సమ్మయ్య, సారయ్య, సత్యనారాయణ, కృష్ణ, బాపు పాల్గొన్నారు.

పలిమెల: మండలంలోని పంకెన గ్రామానికి చెందిన సర్పంచ్ బొచ్చు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి, స్థంబంపల్లి, మహాముత్తారం గ్రామాల్లోని యువకులు బీఆర్ఎస్ కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



కాళేశ్వరం: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఎంపీటీసీ సభ్యురాలు రేవెల్లి మమత–నాగరాజు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాటారం మండలం ధన్వాడలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు సమక్షంలో పార్టీ కండువా కప్పుకొన్నారు. ఆమెతో పాటు వార్డు సభ్యులు పిట్టల సోనిసత్యం, బండెల సురేష్, మాజీ వార్డు సభ్యుడు మహ్మద్ నబిలతో పాటు 60 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. అలాగే అన్నారం గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీ రాణిబాయి, జెడ్పీటీసీ అరుణ, ఎంపీటీసీలు దుర్గయ్య, సుధాకర్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, దేవస్థానం మాజీ డైరెక్టర్ మెంగాని అశోక్, మాజీ ఎంపీపీ సత్తమ్మ, నాయకులు సారయ్య, శ్రీనివాసరెడ్డి, శకీల్, రాజబాపు, పవన్, బాబా తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపించండి

మల్హర్: ప్రజలు ఆశీర్వదించి మంథని ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని మాజీ మావోయిస్టు బుందరపు మల్లయ్య అలియాస్ చంద్రన్న కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో చంద్రన్న శుక్రవారం కార్నర్ సమావేశాలు నిర్వహించారు. అనంతరం కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నేషనల్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరుపున తాను ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై కలత చెంది రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. తన పార్టీ గుర్తు సింహం అని ప్రజలు గమనించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్వాడి సుదర్శన్, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెవెల్లి శంకర్, రామగుండం నియోజక వర్గం ఎన్‌సీపీ ఇన్‌చార్జ్ బుర్ర శివ, బాపురెడ్డి, గట్టయ్య, సత్తయ్య, శంకరయ్య, సత్తయ్య, సమ్మిరెడ్డి, నరేష్, రమేష్, రాకేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రన్న

మున్నూరు కాపుల ఆత్మగౌరవం కాపాడుతా..

మహదేవపూర్: మున్నూరు కాపుల ఆత్మగౌరవం కాపాడుతా అని, తనను మంథని ఎమ్మెల్యేగా గెలిపించాలని పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. మండల కేంద్రంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్నూరు కాపులు ముందుకు వచ్చి మద్దతు తెలపడం చాలా సంతోషం అన్నారు. నియోజకవర్గంలోని బీసీలు ఏకతాటిపైకి వచ్చి మద్దతు తెలుపాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే బీసీ దళిత మైనారిటీల సంక్షేమానికి పాటుపడుతానని తెలిపారు. అనంతరం పుట్ట మధును మున్నూరు కాపు సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీపతిబాపు, బాలయ్య, పోత వెంకటస్వామి, మున్నూరు కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.



పుట్ట మధును సన్మానిస్తున్న నాయకులు

గొడవలకు పాల్పడితే కేసులు

కాటారం: ఎన్నికల సందర్భంగా గొడవలకు పాలపడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్సై అభినవ్ హెచ్చరించారు. గత ఎన్నికల్లో గొడవలకు బాధ్యులైన వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి శుక్రవారం కౌన్సిలింగ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నాగరాజు ఎదుట బైండోవర్ చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, యువత సహకరించాలని కోరారు. యువత కేసుల పాలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు.



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు